అంతా అంకెల గారడీ

బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప ప్రజలకు కొత్తగా ఒరిగిందేమీ లేదు. జ్యోతిరావు పూలే పేరుతో రూ.20 వేల కోట్ల సబ్‌ప్లాన్ కోసం బీసీలు గొంతెత్తితే కేవలం రూ.11,405 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకొన్నారు. నేతన్నల సంక్షేమం విషయంలో ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు లేదని తేలిపోయింది. కేవలం రూ.371 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. -వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు

TELANGANA BUDGET- 2025-26

ఎగవేత గ్యారెంటీ

₹23,108cr

బడ్జెట్‌లో విద్యాశాఖకు కేటాయించిన నిధులివే



గ్యారెంటీల పాతర.. అబద్ధాల జాతర

భట్టిది ఝూటా బడ్జెట్

- ప్రసంగం నిండా అబద్ధాలు, అతిశయోక్తులు
- వడ్డీలేని రుణాల పేరిట మహిళలకు మోసం
- రుణమాఫీపై బయటపడ్డ సర్కారు దొల్లతనం
- మహాలక్ష్మికి ఎగనామం.. తులం బంగారానికి మంగళం
- పాలన చేతగాని ప్రభుత్వం
- ఆదాయం కోసం తాగుబోతుల తెలంగాణగా చేస్తున్నది
- బడ్జెట్ పుస్తకంలో 2 పేజీలు పెరిగినయి తప్ప
- పేదల సంక్షేమం పెరగలే : హరీశ్ నిప్పులు

పాలన చేతగాని, పథకాలు అమలు చేయని దద్దమ్మ ప్రభుత్వం ఆదాయం కోసం రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మార్చేందుకు సిద్ధమైంది. కొత్త బార్లు పెట్టి..బీర్ల ధరలు పెంచి..పేదల జేబులు కొట్టి ఈ ఏడాది ఎక్సైజ్‌పై రూ.50 వేల కోట్ల రాబడి లక్ష్యంగా పెట్టుకున్నది. ఆదాయం కోసం అడబిడ్డల పుస్తెలతాళ్లు తెంపేందుకూ వెనకాడడం లేదు. –హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తేతెలంగాణ): అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ బడా ఝూటా బడ్జెట్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. పవిత్రమైన శాసనసభలో రాజకీయ ప్రసంగం చేసి పచ్చి అబద్ధాలు..అతిశయోక్తులు చెప్పారని మండిపడ్డారు. బడ్జెట్ సాక్షిగా ఆరు గ్యారెంటీలకు తిలోదకాలిచ్చారని దుయ్యబట్టారు. మహిళలకు ఏటా లక్ష కోట్ల వడ్డీలేని రుణాలిచ్చి కోటీశ్వరులను చేస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి..కేవలం 5 లక్షల వరకే వర్తింప జేస్తూ జీవో ఇచ్చి మోసం చేశారని ఫైర్ అయ్యారు. బుధవారం అసెంబ్లీలోని మీడియా హాల్‌లో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌కుమార్, వివేకానందతో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూనే కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యాను ఎండగట్టారు.

సగం మంది రైతులకే రుణమాఫీ

సగం మంది రైతులకే రూ.2 లక్షల రుణమాఫీ చేసి అందరికీ పూర్తి చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని హరీశ్ దుయ్యబట్టారు. తన నియోజకవర్గంలో 20 వేల మందికే మాఫీ చేసి, మరో 22 వేల మందికి మొండిచెయ్యి చూపిందని మండిపడ్డారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు భూసేకరణ విషయంలో గోల్‌మాల్ చేశారని, నిరుటి మాదిరిగానే ఉత్తర భాగానికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందని, దక్షిణ భాగానికి డీపీఆర్ చేస్తున్నామని ప్రతిపాదించడం సిగ్గుచేటని, 16 నెలల్లో ఒక్క ఎకరం కూడా సేకరించలేదని, రూపాయి కూడా ఇచ్చింది లేదని ధ్వజమెత్తారు. ఆదాయం కోసం రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, అధికారులకు టార్గెట్లు పెట్టి మరీ మద్యం అమ్మకానికి తెగబడ్డదని విమర్శించారు. నాన్ ట్యాక్స్ రెవెన్యూ కింద రూ.32,618 కోట్లు పెట్టడాన్ని బట్టి చూస్తే యథేచ్ఛగా భూముల పందేరానికి తెరలేపుతున్నట్టు అర్థమవుతున్నదని చెప్పారు. మైనార్టీల కోసం నిరుడు రూ.3 వేల కోట్లు పెట్టి వెయ్యి కోట్లు కూడా ఖర్చు చేయలేదని, కేసీఆర్ ప్రారంభించిన షాదీముబారక్‌కు కూడా నిధులు ఇవ్వడం లేదని విమర్శించారు.

సబ్‌ప్లాన్ పేరిట బీసీలకు ధోకా

అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్‌ప్లాన్ తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు ధోకా చేస్తున్నదని హరీశ్ విమర్శించారు. ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి ప్రస్తుతం పైసా కూడా కేటాయించలేదని తెలిపారు. వాస్తవ విరుద్ధంగా సీఎస్ఎస్ ద్వారా కేంద్రం నుంచి రూ. 15, 729 కోట్లు ప్రతిపాదించడం సత్యదూరమని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,966 కోట్లే వచ్చాయని తెలిపారు.

15 నెలల్లో ఒక్క ఇల్లయినా కట్టారా?

ఏటా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కడతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ 15 నెలల్లో ఎన్ని ఇండ్లు కట్టించిందో చెప్పాలని హరీశ్ నిలదీశారు. ఒక్క ఇల్లు కూడా కట్టకుండానే ప్రకటనలు మాత్రం గొప్పగా ఇస్తున్నదని ఎద్దేవా చేశారు. ఈ విషయాన్ని నిరూపించేందుకు తాను భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరకు కూడా వచ్చేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. ఆత్మీయ భరోసా కింద కేటాయించిన రూ.600 కోట్లు ఏమూలకూ సరిపోవని, ఏ విధంగా చూసినా కాంగ్రెస్ బడ్జెట్‌లో అంకెల గారడీయే కనిపిస్తున్నదని దెప్పిపొడిచారు.

మొదటిపేజీ తరువాయి...

చేసుకుంటుంటే సర్కారు మాత్రం అందాల పోటీల పేరిట ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. శాసనసభలో ప్రతిపక్షాలపై రంకెలు వేసిన రేవంత్‌రెడ్డి, బడ్జెట్‌లో అంకెల గారడీతో ప్రజలను మోసం చేశారని నిప్పులు చెరిగారు.

40 శాతం కమీషన్ల కాంగ్రెస్

20 శాతం కమీషన్లను 40 శాతానికి పెంచుకొనేందుకే బడ్జెట్‌లో తప్పుడు లెక్కలు చెప్పారని కేటీఆర్ ఆక్షేపించారు. ప్రీబస్సుతో ఇబ్బందులు పడుతున్న 8 లక్షల మంది ఆటోకార్మికుల గురించి ప్రస్తావించకపోవడం బాధాకరమని వాపోయారు. 100 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నా సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. ఆటోకార్మికుల సంక్షేమ బోర్డుకు అతీగతీలేకుండా పోయిందని చెప్పారు.

కాంగ్రెస్‌వి కాగితాలే

జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఏటా రెండు లక్షల ఉద్యోగాలిస్తామని అశోక్‌నగర్ సాక్షిగా రేవంత్, రాహుల్ ఇచ్చిన హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. 'కేసీఆర్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించి, ఇంటర్వ్యూలు పెట్టి ఉద్యోగాల భర్తీకి అన్నీ సిద్ధం చేస్తే.. అభ్యర్థులచేతికి కాగితాలిచ్చి కాంగ్రెస్ సర్కారు తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటు.. కేవలం ఏడు వేల ఉద్యోగాలిచ్చిన రేవంత్‌రెడ్డి..పదే పదే 57 వేల కొలువులిచ్చామని అబద్ధాలు చెప్పడం ఎంతవరకు సమంజసం?' అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని అశోక్‌నగర్ చౌరస్తా వేదికగా నిరూపించేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నదని, దమ్ముంటే రాహుల్, రేవంత్ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

కులగణనలో బీసీలకు మోసం

ఉద్యోగులకు 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి కేసీఆర్ న్యాయం చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఉద్యోగులకు పీఆర్సీతో పాటు 5 డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ మాత్రం బడ్జెట్‌లో ఆ ఊసే మరిచిందని విమర్శించారు. కులగణన పేరిట బీసీల సంఖ్యను తగ్గించి పచ్చి మోసం చేసిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో ఫ్లై ఓవర్లు నిర్మించి..రోడ్లు వేయించి అందంగా తీర్చిదిద్దిన హైదరాబాద్‌ను అధ్వానంగా చేసిన ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మొత్తంగా బడ్జెట్‌ను చూస్తే రేవంత్‌రెడ్డి అనుభవలేమి, పాలనావైఫల్యానికి నిలువుటద్దంలా కనిపిస్తున్నదని ఎద్దేవా చేశారు. యువ వికాసం ముసుగులో రూ. 6వేల కోట్లు కాంగ్రెస్ కార్యకర్తలకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు.

మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు

రేవంత్ పాపం..రైతన్నకు శాపం

సీఎం రేవంత్‌రెడ్డి పాపం రైతన్నలకు శాపంగా మారిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చేతకాని సర్కార్.. చేవలేని సీఎం' అని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోవడానికి ఎండలే కారణమని రేవంత్ పేర్కొనడం తన అవగాహనా రాహిత్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. చేతకాని కాంగ్రెస్ సర్కార్ వల్లే పంటలు ఎండుతున్నాయని తేల్చిచెప్పారు. ఎండిన వరిపైరుతో అసెంబ్లీ ప్రాంగణంలో నిరసన తెలిపిన అనంతరం కేటీఆర్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ రేవంత్ సర్కార్ నేరపూరిత నిర్లక్ష్యం వల్లే రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని, అందుకు ప్రభుత్వం ఎండిపోయిన ప్రతి ఎకరాకూ రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని, ఇందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్నివిధాలుగా వెన్నుదన్నుగా ఉన్నామని, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహా పలువురు నేతలు పర్యటిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటున్నారని చెప్పారు.

సర్కార్ చేతగానితనంతో 480 మంది రైతుల బలవన్మరణం

రాష్ట్రంలో ప్రభుత్వ చేతగానితనం వల్లే 480 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కేటీఆర్ వాపోయారు. ఓవైపు రైతుల ఆత్మహత్యలు కొనసాగుతుంటే అందాల పోటీలు అవసరమా? అని నిప్పులు చెరిగారు. కేసీఆర్ మీద కోపంతో కాళేశ్వరం నీళ్లు ఇవ్వకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కాళేశ్వరం బరాజ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక దోపిడీ చేస్తున్నదని, చరిత్రలో ఎప్పుడూలేని విధంగా ప్రభుత్వమే ఇసుక వ్యాపారం చేస్తున్నదని విమర్శించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో పంటలు పూర్తిగా ఎండుతున్నా ప్రభుత్వం చేష్టలుడికి చూస్తున్నదని మండిపడ్డారు. సాధారణ వర్షపాతం కన్నా రాష్ట్రంలో అత్యధికంగా నమోదైనా నీటిని వాడుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కృష్ణాలో 22 శాతం నీటిని కూడా రేవంత్ ప్రభుత్వం వినియోగించలేదని, అందుకే రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని వాపోయారు.

> కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ సాక్షిగా ఆటో డ్రైవర్ల నుంచి అన్నదాతల దాకా అన్ని వర్గాల వారిని దగా చేసింది. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఏమోగానీ ట్రిలియన్ డాలర్ల అప్పులు తేవడం ఖాయంగా కనిపిస్తున్నది. నమ్మి ఓటేసిన పాపానికి పింఛన్లు పెంచకుండా వృద్ధులను, దివ్యాంగులను, నెలకు రూ. 2500 ఇవ్వకుండా ఆడబిడ్డలను, స్కూటీలు ఇవ్వకుండా విద్యార్థినులను, పెట్టుబడి సాయం ఇవ్వకుండా, రుణమాఫీ చేయకుండా రైతులను, ఆత్మీయ భరోసా ఇవ్వకుండా వ్యవసాయ కూలీలను.. మద్యం దుకాణాల్లో 25 శాతం రిజర్వేషన్లను ఇవ్వకుండా గౌడన్నలను, రెండో విడత గొర్రెపిల్లలు ఇవ్వకుండా గొల్లకుర్మలను, రూ.12 లక్షల దళితబంధు ఇవ్వకుండా దళితులను ఇలా కోట్లాది మందిని నట్టేట ముంచింది. – కేటీఆర్

> అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలకు ఎగనామం పెట్టిన కాంగ్రెస్ అంటే కరోనా కంటే డేంజర్ అనే విషయం ప్రజలకు అర్థమైంది. 20 శాతం కమీషన్లను 40 శాతానికి పెంచుకొనేందుకే బడ్జెట్‌లో తప్పుడు లెక్కలు చెప్పారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రూపుదిద్దుకున్న ప్రగతి రథ చక్రానికి కాంగ్రెస్ సర్కారు పంక్చర్ చేసింది. కేసీఆర్ హయాంలో నేతన్నల అభ్యున్నతికి రూ.1200 కోట్ల బడ్జెట్ పెడితే కాంగ్రెస్ కేవలం రూ. 370 కోట్లు కేటాయించి చేతులు దులుపుకొన్నది. – కేటీఆర్

మేతగా వరిపొలాలు

కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్ల వరిపొలాలు మేకలు, గొర్లకు మేతగా మారాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కేవలం రూ. 6 కోట్లు విడుదల చేయకపోవటం వల్ల దేవాదుల కింద రూ. 600 కోట్ల పంట నష్టం జరిగిందని చెప్పారు. లక్షల ఎకరాల పంట దెబ్బతిన్నదని వివరించారు. దేవాదుల పంపుల విషయంలో బీఆర్ఎస్ నిరసన తెలిపేదాకా ప్రభుత్వం నిద్ర వీడలేదని, ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని కుండబద్దలు కొట్టారు.

మంత్రులకు మోటర్లు ఆన్‌చేయరాలే!

- 'దేవాదుల' ఘనత కేసీఆర్‌దే
- అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యే పల్లా

హైదరాబాద్, మార్చి 19 (నమస్తేతెలంగాణ): 'మొన్న హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో అట్టహాసంగా వరంగల్‌కు వెళ్లిన మంత్రులు.. నీళ్లిచ్చామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు తప్ప, దేవాదుల ప్రాజెక్ట్ మోటర్లు కూడా ఆన్‌చేయలేకపోయారు..' అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అలాంటి నాయకులు దయ్యాలు వేదాలు వల్లించిన చందంగా తామే ఆ ప్రాజెక్టును నిర్మించామని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 2001లో చంద్రబాబు శంకుస్థాపన చేస్తే ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌కే దక్కుతుందని స్పష్టంచేశారు. కానీ, కాంగ్రెస్ సర్కారు ఓఅండ్‌ఎం ఖర్చులకు రూ. 6 కోట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. సర్కారు అలక్ష్యంతోనే నీళ్లు ఇవ్వడం ఆలస్యమైందని, అందుకే జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లోని 50 వేల ఎకరాల్లోని పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదన్నారు.

రేపటికి ఉభయ సభలు వాయిదా

హైదరాబాద్, మార్చి19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఉభయ సభలు శుక్రవారానికి వాయిదాపడ్డాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉభయ సభల్లో ప్రభుత్వం రూ.3,04,965కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క, మండలిలో శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇరుసభల్లో బడ్జెట్ ప్రసంగాలు ముగిసిన తర్వాత సభ్యులు మంత్రులకు అభినందనలు తెలిపారు. అనంతరం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభలను శుక్రవారానికి వాయిదా వేశారు.

విద్యారంగానికి మొండిచేయి

- బడ్జెట్‌లో 7.57 శాతమే నిధులు కేటాయించడం దారుణం
- కొత్తగూడెంలో బడ్జెట్ ప్రతుల దహనంలో పీడీఎస్‌యూ నేతలు

కొత్తగూడెం టౌన్/ తిరుమలాయపాలెం, మార్చి 19:తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వం మొండిచేయి చూపిందని పీడీఎస్‌యూ నాయకులు విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ శాతం నిధులను కేటాయించడాన్ని నిరసిస్తూ ఆ సంఘం నాయకులు కొత్తగూడెం జిల్లా కేంద్రంలో, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో బుధవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ.. విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్.. నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. కేవలం 7.57 శాతం నిధులనే కేటాయించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అబద్ధం.. బోగస్.. ఫాల్స్!

- బడ్జెట్‌పై బీఆర్ఎస్ అభ్యంతరాలు
- రుణమాఫీ నిల్.. రైతుభరోసా బోగస్
- తెలంగాణ తల్లి.. కాదు కాంగ్రెస్ తల్లి
- మండలిలో కవిత సహా ఎమ్మెల్సీల ఛలోక్తులు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): శాసనమండలిలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర మంత్రి డీ శ్రీధర్‌బాబు ప్రవేశపెడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తీవ్ర అభ్యంతరాలను వ్యక్తంచేశారు. అన్నీ అబద్ధాలే వల్లెవేస్తున్నారని, బోగస్ మాటలు చెప్తున్నారని వ్యంగ్యధోరణలో ఛలోక్తులు విసురుతూ తమ నిరసనలు తెలిపారు. మంత్రి తన ప్రసంగంలో రైతు రుణమాఫీని అమలు చేశామని ప్రస్తావించగా, అది 'ఫాల్స్' అంటూ ఒక్కుమ్మడిగా నినదించారు. రైతు బోనస్ ఇచ్చామనగానే, అదంతా 'బోగస్' అంటూ అరిచారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటును ప్రస్తావించనప్పుడు.. అది తెలంగాణ తల్లి కాదు, 'కాంగ్రెస్ తల్లి' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అభ్యంతరం వ్యక్తంచేశారు. తెలంగాణ పాట అనగానే.. దానికి 'ఆంధ్రా మ్యూజిక్ .. చాలా బాగుంది' అని ఎమ్మెల్సీ కవిత వ్యంగ్య ధోరణితో వ్యాఖ్యానించారు. చేనేతల కోసం రూ.20 వేల కోట్లు ప్రతిపాదించాల్సి ఉండగా, కేవలం రూ.11,405 కోట్లనే కేటాయించడాన్ని బీఆర్ఎస్ సభ్యులు తప్పుబట్టే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో 64.7 లక్షల మంది మహిళా స్వయం సహాయక సభ్యులకు రెండు నాణ్యమైన చీరలు ఇస్తామని అన్నప్పుడు.. అదంతా 'ఫాల్స్.. ఫాల్స్' అంటూ బడ్జెట్ ప్రసంగం మధ్యలో అభ్యంతరం తెలిపారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఓ సమయంలో జోక్యం చేసుకొని, వారిని వారించే ప్రయత్నం చేసినా, బడ్జెట్ చివరివరకు అభ్యంతరాలను వ్యక్తంచేస్తూనే ఉన్నారు. అంతకుముందు శాసనమండలి ప్రారంభ సమయంలో రాష్ట్రంలో ఏర్పడిన నీటి ఎద్దడికి నిరసనగా మెడలో ఆకుపచ్చ కండువాలు కప్పుకొని నిరసన తెలుపుతూ సమావేశాలకు హాజరయ్యారు.

మరికొన్ని అభ్యంతరాలు

- ప్రపంచ ప్రఖ్యాతిచెందిన 16 కంపెనీలతో సుమారు రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుందని బడ్జెట్ ప్రసంగంలో చదువుతుండగా, అదంతా ఫాల్స్ అంటూ బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు.
- అమెరికా, సౌత్‌కొరియా, సింగపూర్ దేశాల పర్యటనలో సీఎం మరో రూ.14,900 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నారనగానే ఇదీ 'ఫాల్స్' అని నినదించారు.
- రాష్ట్రంలో 20 వేల మంది మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వడానికి రూ.21,632 కోట్లు రుణాలు అందించామని, 214 ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లు ప్రారంభించామని, స్వయం సహాయక సంఘాలకు 37.5 లక్షల యూనిఫామ్ కుట్టుగూళ్లకు ఇచ్చి, వారికి రూ.28 కోట్ల ఆదాయం చూపించాం.. అంటూ మంత్రి శ్రీధర్‌బాబు చెప్తుండగా, అబద్ధాలు ఉన్నాయని, అవన్నీ ఫాల్స్ అని ఎమ్మెల్సీ కవిత, ఇతర బీఆర్ఎస్ సభ్యులు అడుగడుగునా అభ్యంతరాలు వ్యక్తంచేశారు.

కాంగ్రెస్ పాపం..రైతన్నకు శాపం

- ఇది కాలం తెచ్చిన కరువు కాదు.... కాంగ్రెస్ తెచ్చిన కరువు
- ఎండిన వరితో మండలి ఆవరణలో బీఆర్ఎస్ నేతల నిరసన
- నీళ్లు ఉండీ పొలాలు ఎండబెడుతారా?: మధుసూదనాచారి
- ప్రభుత్వ పెద్దలకు నీటి నిర్వహణపై అవగాహన లేదు: కవిత

మండలి వద్ద ఎండిన వరితో నిరసన తెలుపుతున్న మండలి విపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు కవిత, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, వాణిదేవి తదితరులు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ చేసిన పాపం రైతన్నలకు శాపంగా మారిందని శాసనమండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూధనాచారి విమర్శించారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతుల దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు శాసనమండలి ఆవరణలో బీఆర్ఎస్ సభ్యులు బుధవారం వరికంకులతో నిరసన తెలిపారు. ఎండిన వరి.. రైతుకు కాంగ్రెస్ పెట్టిన ఉరి అంటూ నినాదాలు చేశారు. నీళ్లు ఉండి కూడా పొలాలు ఎండబెడుతారా? అని నిలదీశారు. బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసుల తీరుపైనా సభ్యులు అభ్యంతరం తెలిపారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మధుసూదనాచారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో వరి ఎండిపోయిందని చెప్పారు. పదేండ్ల పాటు బీఆర్ఎస్ పాలనలో చెరువులు నింపిన కేసీఆర్ రైతులకు స్వర్ణయుగం తెచ్చారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలనలో పంటలకు గిట్టుబాటు ధర లేదని, రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతాంగానికి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల కోసం బీఆర్ఎస్ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎండలతోనే పంటలు ఎండుతున్నాయనడం సిగ్గుచేటు : ఎమ్మెల్సీ కవిత

ఎండల వల్లే రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. నిరుడు వర్షాలు సమృద్ధిగా పండాయని, ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నీటి నిర్వహణ తెలియకపోవడంతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో నాటి సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వారా చెరువులు నింపారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టుల ఆయకట్టు కింద ఉన్న పొలాలు కూడా ఎండిపోతున్నాయని ధ్వజమెత్తారు. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృష్ణా నది నుంచి 10 వేల క్యూసెక్కుల నీళ్లు ఎత్తుకుపోతుంటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చూస్తూఊరుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అసమర్థత వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా పెరిగిందని చెప్పారు. కేసీఆర్ రైతుల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టించారని, ఆయన మీద కోపంతో ఆ నీళ్లు వాడుకోకపోవడం సరైనది హితవు పలికారు. ఇప్పటికైనా ఉన్న నీటి వనరులను సక్రమంగా వాడుకొని రైతులకు నీళ్లు ఇవ్వాలని సూచించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టంచేశారు. సమావేసంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, సురభి వాణిదేవి, షేరి సుభాష్‌రెడ్డి, శంభీపూర్ రాజు, ఎల్.రమణ, తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిపైరు తిరుగుబాటు!

- పదేండ్ల తర్వాత ఎండినపైరు
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై బీఆర్ఎస్ పోరుబాట
- బీఆర్ఎస్ శ్రేణుల నినాదాలతో ఎగిసిన అసెంబ్లీ ఆవ'రణం'
- మళ్లీ 'ఉమ్మడి' పాలన ఉద్యమ దృశ్యాలు ప్రత్యక్షం

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్‌పై వరిపైరు తిరుగుబాటు జెండా అయింది. ఎండిన పంట అసెంబ్లీ వేదికగా ఎలుగెత్తి నినదించింది. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో మళ్లీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి ఉద్యమ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ రైతులకు జరుగుతున్న అన్యాయంపై నాడు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆగ్రహించినట్టే బుధవారం కూడా నిప్